వసుంధర యాదవ్

తెలంగాణకు నలుగురే ఐపీఎస్‌లు

- 76వ బ్యాచ్‌లో 188 మంది
- 58 మంది మహిళా ఐపీఎస్‌లు
- ఎన్‌పీఏలో 20న దీక్షాంత్ పరేడ్
- సీఎం విజ్ఞప్తిపై కేంద్రం స్పందనేది?

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి నలుగురు ఐపీఎస్‌లను కేటాయిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీచేసింది. 2024 బ్యాచ్‌కు చెందిన 76 రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ (ఆర్‌ఆర్)లో తెలంగాణకు కేవలం నలుగురు ఐపీఎస్‌లను మాత్రమే కేటాయించింది. ఈ ఏడాది మొత్తం 207 మంది ట్రైనీ ఐపీఎస్ శిక్షణ పూర్తిచేసుకోగా, అందులో 188మంది ఐపీఎస్‌లు, మరో 19మంది నేపాల్, భూటాన్, మాల్దీవ్ ఫారెన్ ఆఫీసర్స్ ఉన్నారు. బ్యాచ్‌లో మొత్తం 58మంది మహిళా ఐపీఎస్‌లు ఉన్నారు. ఈ నెల 20న జాతీయ పోలీస్ అకాడమీలో 76వ ఐపీఎస్ దీక్షాంత్ పరేడ్ నిర్వహించనున్నట్టు ఎన్‌పీఏ డైరెక్టర్ అమిత్‌గార్గ్ వెల్లడించారు. తెలంగాణ క్యాడర్‌కు వరంగల్ జిల్లాకు చెందిన రుత్విక్ సాయి కొట్టె, పత్తిపాక సాయికిరణ్, జమ్మూకశ్మీర్‌కు చెందిన మనన్ భట్, యూపీకి చెందిన వసుంధర యాదవ్‌ను కేటాయించారు.

సీఎం రిక్వెస్ట్ పక్కకేనా?

ఈఏడాది జూలైలో ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో పలుమార్లు భేటీ అయ్యారు. తెలంగాణకు 61మంది ఐపీఎస్‌లను కేటాయించాలని రిక్వెస్ట్ చేశారు. అయితే, ఈ ఏడాది దీక్షాంత్ పరేడ్ నుంచి బయటికి రానున్న వారిలో కనీసం 10మందినైనా కేటాయిస్తారని భావించారు. కేవలం నలుగురిని మాత్రమే కేటాయించడంతో సీఎం విన్నపాలు బూడిదలో పోసినట్టేనా? అని కొందరు రిటైర్డ్ ఐపీఎస్‌లు పెదవి విరుస్తున్నారు.

జానీమాస్టర్‌పై చర్యలు తప్పవు

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): ఓ అసిస్టెంట్ మహిళా కొరియోగ్రాఫర్‌పై ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ జానీమాస్టర్ లైంగిక వేధింపుల కేసుపై రాష్ట్ర మహిళా కమిషన్ సీరియస్ అయింది. బాధిత మహిళకు పోలీసులు భద్రత కల్పించాలని ఆదేశిస్తామని చెప్పింది. బాధితురాలు బుధవారం మహిళా సంఘాల నాయకులతో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను కలిశారు. జానీమాస్టర్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, మతం మార్చుకొని పెళ్లి చేసుకోవాలని బలవంతం చేశాడని ఫిర్యాదు చేసింది. ఇప్పటికే జానీ కోసం పోలీసులు గాలిస్తుండగా, తాజాగా బాధితురాలు మహిళా కమిషన్‌ను ఆశ్రయించింది. బాధిత మహిళకు కమిషన్ అండగా ఉంటుందని చైర్‌పర్సన్ శారద వారికి భరోసా ఇచ్చారు. మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన వారెవరైనా వదిలేది లేదని, కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. బాధితురాలికి రక్షణ లేదని, ఆమెకు సెక్యూరిటీ ఇవ్వాలని పోలీసులను ఆదేశిస్తానని ఆమె తెలిపారు.

జానీ మాస్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి: ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ

మహిళా కొరియోగ్రాఫర్‌ను లైంగికంగా వేధించిన జానీమాస్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌లో లైంగిక వేధింపుల ఫిర్యాదుల ప్యానల్ ఉన్నప్పటికీ మహిళలపై వేధింపులు పెరుగుతూనే ఉన్నాయని, ఈ ప్యానల్ మహిళలకు ధైర్యం కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ప్యానల్ చిత్తశుద్ధితో వ్యవహరించి జానీమాస్టర్‌పై కఠిన చర్యలు తీసుకొని, భాదితురాలికి అండగా ఉండాలని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సృజన, ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ సదాలక్ష్మి డిమాండ్ చేశారు.

సుసంపన్న తెలంగాణ

- కేసీఆర్‌పాలనలో రాష్ట్రంలో ఆర్థిక పురోగతి
- తలసరి ఆదాయంలో దేశంలోనే అగ్రస్థానం
- జాతీయ సగటుతో పోలిస్తే 94 శాతం ఎక్కువ
- ప్రధాని ఆర్థిక సలహా మండలి నివేదికలో వెల్లడి
- అంకెలు అబద్ధాలు చెప్పవంటూ కేటీఆర్ ట్వీట్
- కేసీఆర్ విజయాలను ఎప్పటికీ చెరిపేయలేరని వెల్లడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అతి పిన్న రాష్ట్రంగా పిలుస్తున్న తెలంగాణ ఆర్థిక వృద్ధిలో రారాజుగా వెలుగొందుతున్నది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నేతృత్వంలో తొమ్మిదిన్నరేండ్ల పాలనలో పటిష్ట పునాదులపై పునర్నిర్మాణమైన తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు దేశానికే తలమానికంగా నిలిచింది. తలసరి ఆదాయం, జీఎస్డీపీలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచి సుసంపన్నమైన రాష్ట్రంగా కొత్త రికార్డు సృష్టించింది. ఈ మేరకు ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) తాజా నివేదికలో వెల్లడించింది.

తలసరి, జీఎస్డీపీలో టాప్

పౌరుల తలసరి ఆదాయాన్ని, ఉత్పాదకతను దేశ లేదా రాష్ట్రాభివృద్ధికి కొలమానంగా తీసుకొంటారు. కేసీఆర్ ప్రభుత్వహయాంలో గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో తెలంగాణ ఈ రెండు అంశాల్లో రాకెట్ వేగంతో దూసుకుపోయింది. ఈఏసీ-పీఎం తాజా నివేదిక ప్రకారం తలసరి ఆదాయంలో జాతీయ సగటు కంటే తెలంగాణ 94 శాతం ఎక్కువ తలసరిని నమోదు చేసింది. తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా కర్ణాటక, తమిళనాడు, కేరళ ఉన్నాయి. ఇక, జీడీపీలో తెలంగాణ వాటా కూడా అంతకంతకూ పెరుగుతున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. 2010-11లో దేశ జీడీపీలో తెలంగాణ వాటా 3.8 శాతంగా ఉండగా.. 2023-24 నాటికి ఇది 4.9 శాతానికి ఎగబాకింది. 13 ఏండ్ల వ్యవధిలో ఈ స్థాయిలో పెరుగుదల నమోదు చేసిన అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నట్టు నివేదిక వివరించింది. 2014-15లో అప్పటి ధరలను బట్టి రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) రూ. 5.05 లక్షల కోట్లుగా నమోదైంది. 2023-24నాటికి తెలంగాణ జీఎస్డీపీ రూ. 14.64 లక్షల కోట్లకు చేరింది. పదేండ్ల వ్యవధిలో తెలంగాణ జీఎస్డీపీ రూ. 9.59 లక్షల కోట్ల మేర పెరిగింది.

దక్షిణాదిదే హవా

1991 కంటే ముందు దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా పెద్దగా లేనప్పటికీ, అనంతర కాలంలో జీడీపీలో వీటి ప్రాతినిధ్యం అనూహ్యంగా పెరిగినట్టు ఈఏసీ-పీఎం నివేదిక వెల్లడించింది. 2023-24 నాటికి దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, ఏపీ, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు దేశ జీడీపీలో దాదాపు 30 శాతం వాటాను కలిగి ఉన్నట్టు నివేదిక స్పష్టం చేసింది. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే, దక్షిణాది రాష్ట్రాల్లో ఉత్పాదకత, తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్నట్టు వివరించింది. ముఖ్యంగా 2000వ సంవత్సరం నుంచి దక్షిణాది రాష్ట్రాల్లో నమోదైన తలసరి ఆదాయం జాతీయ సగటుతో పోలిస్తే ఎంతో ఎక్కువగా ఉన్నట్టు తెలిపింది.

దేశంలో సంపన్న రాష్ట్రాలు/యూటీ (సాపేక్ష తలసరి ఆదాయం లెక్కల్లో)

రాష్ట్రం	1960-61	2023-24(జాతీయ సగటు 100% తీసుకొంటే)
ఢిల్లీ	218.3%	250.8%
తెలంగాణ	-	193.6%
కర్ణాటక	96.7%	180.7%
హర్యానా	106.9%	176.8%
తమిళనాడు	109.2%	171.1%

పేద రాష్ట్రాలు/యూటీ (సాపేక్ష తలసరి ఆదాయం లెక్కల్లో)

రాష్ట్రం	1960-61	2023-24 (జాతీయ సగటు)
బీహార్	70.3%	32.8%
ఝార్ఖండ్	-	57.2%
ఉత్తరప్రదేశ్	82.4%	50.8%
మణిపూర్	50.3%	66%
అస్సాం	102.9%	73.7%

తెలంగాణ, జాతీయ తలసరి వివరాలు (రూ.ల్లో)

ఆర్థిక సంవత్సరం	తలసరి ఆదాయం		వృద్ధి శాతం	
	తెలంగాణ	దేశం	తెలంగాణ	దేశం
2014-15	1,24,104	86,647	10.6	9.5
2015-16	1,40,840	94,797	13.5	9.4
2016-17	1,59,395	1,04,880	13.2	10.6
2017-18	1,79,358	1,15,224	12.5	9.9
2018-19	2,09,848	1,25,946	17.0	9.3
2019-20	2,31,326	1,32,341	10.2	5.1
2020-21	2,25,663	1,27,065	-2.4	-4.0
2021-22	2,70,839	1,48,524	20.0	16.9
2022-23	3,12,398	1,72,276	15.3	16.0
2023-24	3,47,299	1,83,236	11.1	6.3

జీఎస్డీపీ/జీడీపీ పెరుగుదల ఇలా..

ఆర్థిక సంవత్సరం	జీఎస్డీపీ/జీడీపీ (రూ. కోట్లలో)		వృద్ధి శాతం	
	తెలంగాణ	దేశం	తెలంగాణ	దేశం
2014-15	5,05,849	1,24,67,959	12.0	11.0
2015-16	5,77,902	1,37,71,874	14.2	10.5
2016-17	6,58,325	1,53,91,669	13.9	11.8
2017-18	7,50,050	1,70,90,042	13.9	11.0
2018-19	8,57,427	1,88,99,668	14.3	10.6
2019-20	9,50,090	2,01,03,593	10.8	6.4
2020-21	9,42,814	1,98,29,927	-0.8	-1.4
2021-22	11,28,907	2,34,71,012	19.7	18.4
2022-23	13,13,391	2,72,40,712	16.3	16.1
2023-24	14,63,960	2,95,36,500	11.4	8.4

జాతీయ సగటుతో పోలిస్తే, తెలంగాణ తలసరి ఆదాయంలో వృద్ధి ఇలా..

అంకెలు ఎప్పుడూ అబద్ధాలు చెప్పవు.. కేసీఆర్ విజయాలు చెదిరిపోవు: కేటీఆర్

బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ అత్యంత అద్భుతంగా అభివృద్ధి చెందిందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి తేల్చిచెప్పింది. తెలంగాణ అభివృద్ధి చెందిందనడానికి ఇంతకంటే వేరే సాక్ష్యం ఏం కావాలి? కేవలం తొమ్మిదిన్నరేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో జాతీయ సగటు కంటే 94 శాతం అధిక తలసరి ఆదాయాన్ని తెలంగాణ నమోదు చేసింది. తెలంగాణను కేసీఆర్ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. అంకెలు ఎప్పుడూ అబద్ధాలు చెప్పవు. కేసీఆర్ సాధించిన విజయాలు ఎప్పటికీ చెరిపేయలేరు. జై తెలంగాణ..

-ఎక్స్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ కారును అడ్డుకొని మాట్లాడుతున్న కూరగాయల వ్యాపారులు

ఎమ్మెల్యే వినోద్‌కు నిరసన సెగ

- అడ్డుకున్న కూరగాయల వ్యాపారులు
- దుకాణాలకు అడ్వాన్స్ కట్టలేమని స్పష్టీకరణ

బెల్లంపల్లి, సెప్టెంబర్ 18 : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు నిరసన సెగ తగిలింది. బుధవారం బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల జాతీయ రహదారి పక్కన ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలించి వస్తున్న ఎమ్మెల్యేను ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం దుకాణాల్లోని కూరగాయల వ్యాపారులు అడ్డుకున్నారు. మార్కెట్ భవనంలోని దుకాణాలను ఉచితంగా కేటాయిస్తామని చెప్పి భవన సముదాయం పూర్తికాగానే అధికారులు అడ్వాన్సులు, నెలవారి అద్దెలు అడుగుతున్నారని వారు ఎమ్మెల్యేను నిలదీశారు. తమ దుకాణాలకు తాము అడ్వాన్సులు ఇవ్వడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము నిరుపేదలమని, అడ్వాన్స్‌లు ఎక్కడి నుంచి తెచ్చేదని, కేవలం నెలవారి అద్దె మాత్రం చెల్లిస్తామని చెప్పారు. సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో కూరగాయల వ్యాపారులు శాంతించారు.

కంగన రనౌత్‌వి భోగం వేషాలు

బీజేపీ ఎంపీపై దానం అభ్యంతరకర వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): ఎంపీ, సినీనటి కంగనా రనౌత్‌పై ఎమ్మెల్యే దానం నాగేందర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'సినిమాల్లో భోగం వేషాలు వేసే కంగనా రనౌత్‌కు రాహుల్‌గాంధీ గురించి మాట్లాడే నైతిక హక్కు ఉన్నదా' అని తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సినీవృత్తిలో భాగంగా చేసే కార్యక్రమాలను కించపరచడం ఎమ్మెల్యే హోదాలో ఉన్న దానంకు తగునా? అని ప్రశ్నిస్తున్నారు. ఇది మహిళలను కించపరచడం కాదా? అని నిలదీస్తున్నారు. మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేసిన దానంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రాహుల్‌గాంధీపై బీజేపీ నేతల విద్వేషపూరిత వ్యాఖ్యలను నిరసిస్తూ నిర్వహించిన ధర్నాలో కంగనపై దానం నోరుపారేసుకున్నారు.

డీజే సౌండ్‌తో గుండెపోటు.. యువకుడి మృతి

మాక్లూర్, సెప్టెంబర్ 18 : గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో డీజే సౌండ్‌కు గుండెపోటుతో ఓ యువకుడు మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ముత్యంపల్లికి చెందిన ఊరడి మధు (27) మంగళవారం మానిక్‌బండార్‌లో హిందూ సేన యువజన గణేశ్ మండలి వినాయక విగ్రహ నిమజనానికి ట్రాక్టర్ తీసుకొచ్చాడు. నిమజ్జన శోభాయాత్ర రామాలయానికి చేరుకోగా.. బుధవారం తెల్లవారుజాము 3గంటల ప్రాంతంలో మధు ఆలయ ఆవరణలో నిద్రించాడు. ఉదయం 8 గంటల సమయంలో గణేశ్ మండలి సభ్యులు అతడిని నిద్రలేపడానికి ప్రయత్నించగా..అప్పటికే మృతిచెంది ఉన్నట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. డీజే సౌండ్‌తో గుండెపోటు వచ్చి మృతిచెందాడని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

2,050 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు

- 28 నుంచి వచ్చేనెల 14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తుల సవరణకు అక్టోబర్ 16 నుంచి 17 వరకు అవకాశం
- నవంబర్ 17న కంప్యూటర్ బేస్డ్ పద్ధతిలో 13 కేంద్రాల్లో పరీక్ష

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వివిధ శాఖల్లో 2,050 నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్) పోస్టుల భర్తీకి వైద్య, ఆరోగ్య సేవల నియామక బోర్డు బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. అర్హులైన అభ్యర్థులు ఈ పోస్టులకు బోర్డు వెబ్‌సైట్ (https://mhsrb.telangana.gov.in) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను అక్టోబర్ 16వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి 17వ తేదీ సాయంత్రం 5.00 గంటల వరకు సవరించుకోవచ్చు. నవంబర్ 17న కంప్యూటర్ బేస్డ్ పద్ధతిలో 13 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామని నోటిఫికేషన్‌లో ప్రభుత్వం తెలిపింది.

నోటిఫికేషన్‌లో అచ్చు తప్పులు.. సవరణ

వైద్య, ఆరోగ్య సేవల నియామక బోర్డు తొలుత విడుదల చేసిన నోటిఫికేషన్ తప్పుల తడకగా ఉన్నది. 2024 సెప్టెంబర్‌లో దరఖాస్తులు స్వీకరించి 2023 అక్టోబర్‌లో దరఖాస్తులను ముగిస్తారట. ఆన్‌లైన్ అప్లికేషన్లకు చివరి తేదీ 14-10-2023 అని నోటిఫికేషన్‌లో ఉన్నది. తమ దరఖాస్తులను 16-10-2023న ఉదయం 10.30 గంటల నుంచి 17-10-2023 సాయంత్రం 5 గంటలకు సవరించుకోవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఆ తర్వాత ఈ తప్పులను సవరించి మరోమారు నోటిఫికేషన్ ఇచ్చారు.

నోటిఫికేషన్‌పై టీఎన్‌ఏ హర్షం

రాష్ట్ర ప్రభుత్వం 2,050 నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల తెలంగాణ (ప్రభుత్వ) నర్సస్ అసోసియేషన్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎంకు, ఆరోగ్య శాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపింది.

పోస్టుల వివరాలు, ఖాళీలు ఇలా..

పోస్టు పేరు	శాఖ పేరు	ఖాళీల సంఖ్య
నర్సింగ్ ఆఫీసర్	డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ / డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్	1576
నర్సింగ్ ఆఫీసర్	తెలంగాణ వైద్య విధాన పరిషత్	332
నర్సింగ్ ఆఫీసర్	ఆయుష్	61
నర్సింగ్ ఆఫీసర్	ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్	1
నర్సింగ్ ఆఫీసర్	ఎంఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ & రీజినల్ క్యాన్సర్ సెంటర్ (ఎంఎన్‌జేఐవో& ఆర్‌సీసీ)	80
	మొత్తం ఖాళీలు: 2,050	

ఆనవాళ్లు దెబ్బతినకుండా ఆలయాల అభివృద్ధి

- రాయగిరిలో వేద పాఠశాల..
- కీసరలో రాముడి విగ్రహం
- భద్రాచలంలో డిజిటల్ మ్యూజియం: మంత్రి సురేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 18(నమస్తే తెలంగాణ): చారిత్రక ఆనవాళ్లు దెబ్బతినకుండా ఆలయాలను అభివృద్ధి చేయాలని అధికారులను దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. కీసర, యాదగిరిగుట్ట,భద్రాచలం ఆలయాల్లో సౌకర్యాల కల్పనపై సచివాలయంలో బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. మానిటరింగ్ కమిటీ నివేదిక వచ్చాక యాదగిరిగుట్ట గర్భగుడి విమాన గోపురం స్వర్ణతాపడం, వేదపాఠశాల పనులను ప్రారంభిస్తామని తెలిపారు. కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో గోవింద హరి చైర్మన్‌గా రాయగిరిలో 20 ఎకరాల్లో రూ.43 కోట్లతో వేదపాఠశాల నిర్మించనున్నట్టు ప్రకటించారు. యాదగిరిగుట్టలో 64 మీటర్ల నెట్‌వర్క్ ఆర్చ్ బ్రిడ్జి ని మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. రామప్ప ఆలయ స్ఫూర్తితో కీసరగుట్టను తీర్చిదిద్దాలని, రాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని సూచించారు. భద్రాచలంలో డిజిటల్ మ్యూజియం ఏర్పాటుకు మంత్రి ఆమోదం తెలిపారు.సమీక్షలో దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, వైటీడీఏ వైస్‌చైర్మన్ కిషన్‌రావు, కంచి కామకోటి వేదపాఠశాల చైర్మన్ గోవింద హరి, కన్జర్వేషన్ ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన జిల్లా ఉద్యానవన అధికారి

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 18 (నమస్తేతెలంగాణ): పండ్ల తోటలకు డ్రిప్ పరికరాల సరఫరాదారు నుంచి రూ.1.14 లక్షలు లంచం తీసుకుంటూ జిల్లా ఉద్యానవన అధికారి ఏసీబీ అధికారులకు చిక్కారు. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు డ్రిప్ పరికరాలను సరఫరా చేసిన వ్యక్తికి ఉద్యానవన శాఖ కార్యాలయం నుంచి బిల్లులు రావాల్సి ఉంది. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ.. పర్సంటేజీ డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. కొత్తగూడెం కలెక్టరేట్‌లో సూర్యనారాయణకు బుధవారం రూ.1.14 లక్షల లంచం ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ రమేశ్ తన బృందంతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు శేఖర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీలో మరణ మృదంగం

- ఒకే నెలలో 50 మంది చిన్నారులు, 14 మంది తల్లులు మృతి
- రాష్ట్రంలో పెరిగిన మాతా శిశుమరణాలు
- తొమ్మిది నెలలుగా నిలిచిపోయిన ఆరోగ్య పథకాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): గాంధీ దవాఖానలో మరణ మృదంగం మోగుతున్నది. పాలకుల పర్యవేక్షణా లోపం, అధికారుల నిర్లక్ష్యం, వైద్యుల కొరత కలగలిసి నిండు ప్రాణాలను తోడేస్తున్నాయి. ఒకే నెలలో 50 మంది శిశువులు, 14 మంది తల్లులు మృత్యువాత పడినట్టు సమాచారం. అయితే ఈ మరణాల విషయమై వివరణ కోరేందుకు నమస్తే తెలంగాణ ప్రయత్నించగా సంబంధిత అధికారులెవరూ స్పందించలేదు. ఒక్క గాంధీ దవాఖానలోనే పరిస్థితి ఇలా ఉంటే.. ఇక హైదరాబాద్‌లోని సుల్తాన్‌బజార్, పేట్లబుర్జ్, నిలోఫర్ టీచింగ్ దవాఖానతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర ప్రభుత్వ దవాఖానల్లో ఎలాంటి పరిస్థితి ఉన్నదో అని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు రోగుల బంధువులు. ఏడాది క్రితం వరకు తగ్గుముఖం పట్టిన మాతా శిశు మరణాలు గత ఎనిమిది నెలలుగా పెరుగుతుండటంతో ప్రజలు సర్కార్ దవాఖానలంటేనే జంకుతున్నారు. దీనికితోడు ఇటీవల జరిగిన బదిలీల్లో సీనియర్ వైద్యులందరినీ బదిలీ చేయడంతో ప్రస్తుతం గాంధీ దవాఖానలో అనుభవజ్ఞులైన వైద్యులు పెద్దగా లేరనే ప్రచారానికి నమోదవుతున్న మరణాల సంఖ్య బలాన్ని చేకూరుస్తున్నది. గత తొమ్మిది నెలల్లో కాంగ్రెస్ సర్కార్ పలు రకాల ఆరోగ్య పథకాలను నిలిపివేసింది. దీనికితోడు గర్భిణీ మహిళలు, బాలింతలకు సరైన పోషకాహారం లభించక, మెరుగైన వైద్యం అందించేందుకు అనుభవజ్ఞులైన వైద్యులు కరువై పురిట్లోనే శిశువులు కన్నుమూస్తున్నారు. తల్లులు సైతం మృత్యువాత పడుతున్నారు.

ఇద్దరు వైద్యులపై వేటు?

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): గాంధీ దవాఖాన ఘటనలో ఇద్దరు అమాయక వైద్యులపై సస్పెన్షన్ వేటు వేసినట్టు తెలిసింది. శిశు మరణాలకు సంబంధించి సమాచారం బయటకు పొక్కడంపై అధికారులు, పాలకులు కలిసి అమాయక వైద్యులను బలిపశువులను చేసినట్టు సమాచారం. జరిగిన ఘటనకు కప్పిపుచ్చుకునేందుకు అధికారులు యత్నిస్తున్నట్టు వైద్య సిబ్బంది ఆరోపిస్తున్నారు. అయితే వైద్యుల సస్పెన్షన్ విషయంపై రాత్రి వరకు అధికారులు అధికారికంగా ధృవీకరించలేదు.

కాన్పు కోసం కడుపుపై తొక్కి..

- సర్కారు దవాఖానలో అందుబాటులో లేని వైద్యులు
- తిడుతూ కొడుతూ నర్సుల వైద్యం
- నొప్పుల కోసం పొట్టపై తొక్కి ప్రసవం
- గంటల్లోపే శిశువు దుర్మరణం
- హుజూర్‌నగర్ దవాఖానలో దారుణం
- డీఎంహెచ్‌వో, పోలీసులకు బాధితుల ఫిర్యాదు

మృతిచెందిన శిశువు (ఫైల్)

పసిబిడ్డను బలితీసుకున్నరు

హుజూర్‌నగర్ ఏరియా దవాఖాన వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మా బిడ్డ చనిపోయాడు. సకాలంలో వైద్యం చేయకుండా జాప్యం చేశారు. డాక్టర్ లేకుండా నర్సులు ఇష్టం వచ్చినట్టు వైద్యం చేసి పసిబిడ్డను బలితీసుకున్నరు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

-పాసిపాక నాగరాజు

హుజూర్‌నగర్, సెప్టెంబర్ 18 : పుట్టబోయే బిడ్డపై ఎన్నో ఆశలు.. సర్కారు దవాఖానపై ఎంతో నమ్మకం పెట్టుకొని వచ్చిన ఆ నిండు గర్భిణి నరకం చూసింది. పురిటి నొప్పులు రావాలని, సాధారణ ప్రసవం కావాలని సిబ్బంది చేసిన నిర్వాకంతో మానసికంగా, శారీరకంగా వేదన అనుభవించింది. బూతులు తిట్టినా.. ఇష్టంవచ్చినట్టు కొట్టినా పుట్టబోయే బిడ్డ కోసం భరించింది. పండంటి బిడ్డ చేతిలోకి వస్తుందని వారు ఎంత ఇబ్బంది పెట్టినా తట్టుకొని ఎదురు చూసిన ఆ తల్లికి చివరికి ఏడుపే మిగిలింది. డ్యూటీ డాక్టర్లు అందుబాటులో లేక.. సర్కారు దవాఖానలో నర్సులు చేసిన అమానవీయ వైద్యం ఓ పసికందు ప్రాణం తీసింది. నొప్పుల కోసం గర్భిణిని తిడుతూ కొడుతూ చివరికి సాధారణ ప్రసవం కోసం పొట్టపై తొక్కడంతో పుట్టిన శిశువు కొద్దిసేపట్లోనే మృతిచెందింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఏరియా దవాఖానలో మంగళవారం ఈ దారుణం జరిగింది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం గుర్రంబోడు తండాకు చెందిన పాసిపాక నాగరాజు భార్య రేణుకకు ఆదివారం పురిటి నొప్పులు రావడంతో హుజూర్‌నగర్ ఏరియా దవాఖానకు తీసుకొచ్చారు. ఆ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నర్సులు అడ్మిట్ చేసుకున్నారు. రాత్రి వరకూ వైద్యం అందించకపోవడంతో నాగరాజు సిబ్బందిని ప్రశ్నించగా రేణుకను తిడుతూ నొప్పులు రావాలని చెప్పి ఆమె పొట్టపై కాలుతో తొక్కారు. సోమవారం తెల్లవారుజామున సాధారణ ప్రసవం చేసి బాబును బయటకు తీసినా, శిశువు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో సూర్యాపేట ఏరియా వైద్యశాలకు రెఫర్ చేశారు. నాగరాజు కుటుంబ సభ్యులు శిశువును తీసుకుని అక్కడికి వెళ్లగా, పరిస్థితి విషమించి పసికందు మృతిచెందాడు. ఈ ఘటనపై నాగరాజు సూర్యాపేట డీఎంహెచ్‌వో కోటాచలానికి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో డీఎంహెచ్‌వో హుజూర్‌నగర్ ఏరియా వైద్యశాలకు వచ్చి విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. శిశువు పోస్టుమార్టమ్ రిపోర్ట్ వివరాలు తీసుకుంటామని తెలిపారు. కాగా, డెలివరీ కోసం ప్రభుత్వ దవాఖానకు వస్తే డ్యూటీ డాక్టర్ విధుల్లో లేరని, నర్సులు అమానవీయంగా ప్రవర్తించారని డీఎంహెచ్‌వో ఎదుట రేణుక కన్నీటిపర్యంతమైంది. నిండు గర్భంతో ఉన్న తనను నర్సులు బూతులు తిడుతూ కొట్టారని, కడుపుపై తొక్కారని బోరున విలపించింది. డ్యూటీ డాక్టర్‌తో పాటు నర్సులపై చర్యలు తీసుకోవాలని రోదిస్తూ చెప్పింది.

'సింగరేణి' ఫలితాల్లో రామ్‌చరణ్‌కు స్టేట్ ఫస్ట్ ర్యాంకు


రామ్‌చరణ్

శాయంపేట, సెప్టెంబర్ 18: హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పెద్దకోడెపాకకు చెందిన పల్నాటి రామ్‌చరణ్ సింగరేణి సంస్థ ప్రకటించిన ఉద్యోగ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. సింగరేణి కాలరీస్ కంపెనీ సివిల్ ఇంజినీర్ పోస్టుల పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేసింది. బీసీ-బీ క్యాటగిరీలో 150 మార్కులకు 113 మార్కులు సాధించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు.

సింగరేణి ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తరహా చర్యలు

అక్రమాలపై సమాచారమిస్తే 10వేల ప్రోత్సాహం: సీఎండీ

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): సింగరేణి ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తరహా చర్యలు తీసుకుంటామని సంస్థ సీఎండీ ఎన్ బలరాం వెల్లడించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి విజిలెన్స్ విభాగం పనితీరుపై బుధవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సింగరేణి సంస్థలో అక్రమాలపై కచ్చితమైన సమాచారాన్నిచ్చిన వారికి రూ. 10వేల ప్రోత్సాహక బహుమతినిస్తామని ప్రకటించారు. అక్రమాలపై 94911 44104 నంబర్, vig@scclmines.com మెయిల్‌కు ఆధారాలతో పంపించాలని ఆయన సూచించారు. సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్మికులను మోసం చేస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇటీవలే మెడికల్‌బోర్డుపై ఏసీబీ, నేరదర్యాప్తు సంస్థలతో విచారణ చేయించినట్టు తెలిపారు. సీఐడీ విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇక 272 ఎక్స్‌టర్నల్ పోస్టుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టును విడుదల చేశామని, త్వరలోనే మిగిలిన 327 పోస్టుల ఫలితాలను విడుదల చేస్తామని తెలిపారు.